E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

తేదీ (25-04-2025) వారం (శుక్రవారం) హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



తెలంగాణలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత 2లో

# మోదీ హెచ్చరిక..

## ఉగ్రవాదంపై భారత్ ఆగ్రహం

- 'దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. ఉగ్రవాదులను మట్టిలో కలిపేస్తాం'
- బిహార్ సభలో అరుదైన మార్పు – మోదీ ఇంగ్లీష్‌లో ప్రసంగం
- 'ఐడెంటిఫై, ట్రాక్, పనిష్' – ఉగ్రవాదులపై భారత్ ధృఢ నిర్ణయం
- పహల్గాం దాడిపై మోదీ ఆవేశం – బాధితులకు న్యాయం తప్పదన్న హామీ
- ప్రపంచానికి స్పష్టమైన సందేశం – మోదీ గళం మారింది, మెసేజ్ మారలేదు
- మానవత్వాన్ని నమ్మిన దేశాలకు కృతజ్ఞతలు – మోదీ కృతజ్ఞతలు తెలిపిన సందర్భం
- ఇంగ్లీష్‌లోనూ మోదీ హెచ్చరిక.. ప్రపంచ దేశాలకు సూటి సందేశం!
- సాధారణంగా హిందీలో ప్రసంగించే ప్రధాని మోదీ.. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ ఆంగ్లంలోనూ హెచ్చరించడం గమనార్హం



2లో



## భారత్ చర్యలను కాపీ కొట్టిన పాక్.. వీసాల రద్దు, వాఘా బోర్డర్ మూసివేత

**పాక్ విషయంలో భారత్ తీసుకున్న చర్యలను దాదాపు కాపీ కొట్టింది. భారత్ తీసుకున్న నిర్ణయాలనే ఆ దేశమూ తీసుకుంది.**

**ఈ కబురు:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న ద్వైపాక్షిక చర్యలపై పాక్ స్పందించింది. ఈ అంశంపై భద్రతా వ్యవహారాలపై ఏర్పాటైన ఆ దేశ అత్యున్నత కమిటీ కొన్ని గంటల పాటు సమావేశమైంది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు మంత్రులు, త్రివిధ దళాలకు చెందిన అధిపతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు భారత్ తీసుకున్న చర్యలనే దాదాపు ఆ దేశం కాపీ కొట్టింది.
సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా తమ దేశంలో తరువాయి 2లో



## భారత్ సమ్మిట్‌లో ఉగ్రవాదంపై డిక్లరేషన్

**ఈ కబురు:**
హైదరాబాద్ వేదికగా జరుగబోయే భారత్ సమ్మిట్ 2025లో తెలంగాణ కల్చర్‌తో ఆర్భాటంగా ఆహ్వానం పలుకేందుకు కార్యక్రమాలు రూపొందించాం. కానీ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడితో యావత్‌దేశం దు:ఖిస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గురుపాల్ సఫల్ పేర్కొన్నారు. హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రదాడి నేపథ్యంలో ఢిల్లీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక సమావేశం నిర్వహించిందని, ఇందులో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, ఇతర నేతలు పాలుపంచుకున్నారని తెలిపారు. అయితే ఈ సమయం సెలబ్రేషన్స్ చేసుకునేది కాదని నిర్ణయం తీసుకోవడ జరిగిందని పేర్కొన్నారు. దాంతోనే భారత్ సమ్మిట్‌సందర్భంగా నిర్వహించ తలపెట్టిన ప్రారంభ వేడుకలను నిర్వహించడం లేదని స్పష్టం చేశారు.

యవత్‌భారత్‌ ఈ ఉగ్రవాదంపై ఆలోచన చేయాల్సిన సమయని పేర్కొన్నారు. ఈ సమ్మిట్లో టెర్రరిజంపై డిక్లరేషన్‌చేయనున్నామని తెలిపారు. టెర్రరిజంపై కాంగ్రెస్‌పార్టీ విరోచితంగా పోరాడిందన్నారు. కాంగ్రెస్‌హయంలో పంజాబ్, అస్సాంలో టెర్రరిజాన్ని మట్టుబెట్టమన్నారు. నార్త్‌ఇండియాలోని రాష్ట్రాలలో కూడా ఉగ్రవాదాన్ని రూపుమాపామన్నారు. కశ్వీర్‌లో కూడా ఉగ్రవాదాన్ని కంట్రోల్‌లోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఉగ్రవాదం విషయంలో కాంగ్రెస్‌పార్టీ రాజీపడే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రత్యేకంగా ఒక ఎగ్జిబిషన్‌కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

భారత్‌సమ్మిట్‌ను రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. ఈ ప్రపంచంలోని పొలిటికల్‌పార్టీలు వాళ్లందరినీ ఏకతాటిపై తీసుకొచ్చేందుకు మొదలుపెట్టామన్నారు. ఈ సదస్సులో వందకుపైగా దేశాల నుండి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. 25 నుంచి 30 మంది మంత్రులు, 15 రాజకీయ పార్టీల అధ్యక్షులు, 50 మంది వరకు ఎంపీలు, సెనేటర్లు, ఇన్వెస్టర్లు ఈ సమావేశానికి విచ్చేస్తున్నారి ఆయన తెలిపారు.



3లో

### కేంద్ర సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకున్నా ఓకే అఖిలపక్ష భేటీలో రాహుల్

## పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు తెలంగాణ ప్రభుత్వం సంతాపం


**ఈ కబురు:** మంగళవారం మధ్యాహ్నం ఉగ్రవాదులు.. కశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రవాదులు తుపాకులతో విరుచుకుపడగా.. 26 మంది పర్యాటకులు మృతి చెందారు. కాగా ఈ ఘటనతో యావత్ భారతదేశం ఉలిక్కిపడిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటన సమయంలో జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి తెలంగాణకు తిరిగి వచ్చారు. అనంతరం గురువారం ఉదయం హైదరాబాద్ లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయం లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.



ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం భట్టి, కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, అందుబాటులో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ.. పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మృతులకు సంతాపం గా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం కశ్మీర్ లో చిక్కుకున్న తెలంగాణ పౌరులను సేఫ్‌గా తీసుకురావడంపై అధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. అమరుడైన జవాను

**భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఉదమ్‌పూర్‌లో ఎన్‌కౌంటర్ జరుగుతోంది.**
**ఈ కబురు:** జమ్మూకశ్మీర్‌లోని ఉదమ్‌పుర్‌లో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారంతో భద్రతా సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే దుడుబసంత్‌గఢ్ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఫైరింగ్ మొదలైంది. ఈ ఘటనలో ఓ సైనికుడు అమరుడయ్యాడని ఆర్మీకి చెందిన వైట్ నైట్ కార్ప్స్ వెల్లడించింది . నిఘా సమాచారం ఆధారంగా ఉదమ్‌పుర్‌లోని బసంత్‌గఢ్‌లో సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు కలిసి ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈక్రమంలో బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. తూటాలు తగిలి ఓ సైనికుడు గాయపడ్డాడని, మెరుగైన వైద్యం అందినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని ఆర్మీ వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.





### యుద్ధానికి సిద్ధమవుతున్న పాకిస్తాన్.. సైన్యానికి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటన

3లో

### నాగారం భూదాన్ భూముల్లో అక్రమాలు.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



## తెలంగాణ పోలీసుశాఖను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

**ఈ కబురు :** తెలంగాణ పోలీసుశాఖను సీఎం రేవంత్ రెడ్డిఅభినందించారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025 లో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డెప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పోలీసు అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి కలిసి ఇండియా జస్టిస్ రిపోర్ట్ లోని అంశాలను వివరించారు.

# డీపీఆర్ ఆమోదం పొందకముందే

## కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణం: ఎన్‌డీఎస్‌ఏ నివేదిక

**కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ఆమోదం పొందకముందే బ్యారేజీల నిర్మాణం చేపట్టారని నిపుణుల కమిటీ తేల్చింది.**
**ఈ కబురు,హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ఆమోదం పొందకముందే బ్యారేజీల నిర్మాణం చేపట్టారని నిపుణుల కమిటీ తేల్చింది. కాళేశ్వరం అంశాలపై ఎన్‌డీఎస్‌ఏ నివేదికను రూపొందించి.. రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలపై అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ.. తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారికి ఎన్‌డీఎస్‌ఏ ఛైర్మన్ అనిల్ జైన్ లేఖ రాశారు. ''బ్యారేజీల నిర్మాణంలో తరువాయి 2లో



## సింధు జలాలను ఆపడమంటే యుద్ధం ప్రకటించడమే: పాక్

**ఇస్లామాబాద్:** పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా భారత్ విధిస్తున్న దౌత్యపరమైన ఆంక్షలకు పాకిస్తాన్ అల్లలాడిపోతోంది. ఈ క్రమంలో ప్రతీకార చర్యలకు దిగింది. పాక్ గగనతలం నుంచి వెళ్లే భారత విమానాలకు అనుమతిని రద్దు చేస్తున్నట్లు



తాజాగా ప్రకటించింది.
గురువారం పాక్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ అధ్యక్షతన జాతీయ భద్రతా కమిటీ సమావేశం జరిగింది. పహల్గాం దాడి తర్వాత పాక్ విషయంలో భారత్ అనుసరిస్తున్న తీరుపై సమీక్ష ఈ భేటీలో సమీక్ష జరిపారు. పాక్ పౌరుల వీసా రద్దు చేయడం, దేశం విడిచి వెళ్లిపోవాలనే ఆదేశాలను పాక్ తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే.. తరువాయి 2లో



3లో

### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్..



3లో

### పాకిస్తాన్ బందీగా భారత జవాన్..

# మోదీ హెచ్చరిక..
# ఉగ్రవాదంపై భారత్ ఆగ్రహం



**ఈ కబురు:** ప్రధాని నరేంద్ర మోదీసాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. అంతర్జాతీయ వేదికలపైనా ఇదే భాషలో భారత వైఖరిని స్పష్టం చేస్తుంటారు. కానీ, నేడు బిహార్‌లో నిర్వహించిన ఓ సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. ఇంగ్లీష్‌లోనూ హెచ్చరించడం గమనార్హం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు తెలుస్తోంది.

'ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' (ప్రతి ఒక్క ఉగ్రవాదిని, వారికి మద్దతుగా నిలిచేవారిని భారత్ గుర్తించి, వెంటాడి, శిక్షిస్తుంది) అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. ''ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ఈ విషయమై దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది'' అంటూ ప్రధాని మోదీ ఇంగ్లీష్‌లో పేర్కొన్నారు.

పహల్గాం ఉగ్రదాడి వేళ భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. ''మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చి.. పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

**'దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. ఉగ్రవాదులను మట్టిలో కలిపేస్తాం'**

పాట్నా: జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదులు సప్తసముద్రాల అవతల దాక్కున్నా సరే వెతికి మరి మట్టిలో కలిపేస్తాం. 140 కోట్ల మంది సంకల్పం ఉగ్రవాదుల్నే కాదు వారిని పెంచి పోషిస్తున్న ఉగ్రవాద నాయకుల వెన్ను విరిచేస్తుంది' అని హెచ్చరించారు.

ప్రధాని మోదీ గురువారం బీహార్‌లో పర్యటించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్ రాష్ట్రం మధుబని నగరంలో మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలను బలోపేతం చేసేందుకు వీలుగా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రూ.13,480కోట్లకు పైగా వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. సభలో మాట్లాడానికి ముందు పహల్గాం బాధితులకు రెండు నిమిషాల కళ్లు మూసుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించారు.

'పహల్గాం ఉగ్ర దాడిలో అమాయకులు చనిపోయారు. దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. పహల్గాం ఉగ్ర దాడిపై ప్రతీకారం తీర్చుకుంటాం. టెర్రరిస్టులకు తగిన గుణపాఠం చెప్తాం. ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది. కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ దుఃఖం, ఆగ్రహం ఉన్నాయి. ఈ దాడి కేవలం అమాయక పర్యాటకులపై మాత్రమే కాదు. భారత దేశ ఆత్మపై దాడి జరిగింది. దాడి చేసిన ఉగ్రవాదులు, దానికి కుట్ర పన్నిన వారికి మనం విధించే శిక్ష వారి ఊహకి కూడా అందదు. జమ్మూకశ్మీర్‌లోనే కాదు దేశంలో ఉగ్రవాదాన్ని నాశనం చేసేందుకు సమయం ఆసన్నమైంది.140 కోట్ల మంది సంకల్పం ఉగ్రవాద నాయకుల వెన్ను విరిచేస్తుందన్నారు.

**సప్త సముద్రాల వెనుక దాక్కున్నా సరే**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నేను ప్రపంచం మొత్తానికి హామీ ఇస్తున్నా. భారత్ ప్రతి ఉగ్రవాదిని, వారికి వెనక ఎవరు ఉన్నా సరే వారిని గుర్తిస్తుంది. శిక్షిస్తుంది. ఉగ్రవాదులు సప్త సముద్రాల వెనుక దాక్కున్నా సరే వెంబడించి మరి మట్టిలో కలిపేస్తాం. ఉగ్రవాదం దేశ స్ఫూర్తిని ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదు. ఉగ్రవాదానికి తప్పక శిక్ష పడుతుంది. న్యాయం జరిగేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సంకల్పంలో మొత్తం దేశం దృఢంగా ఉంది. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మనతో ఉన్నారు. ఈ సమయంలో మనతో పాటు నిలిచిన ప్రపంచ దేశాల ప్రజలకు, వారి నాయకులకు నా కృతజ్ఞతలు'అని అన్నారు.

## భారత్ చర్యలను కాపీ కొట్టిన పాక్..
## వీసాల రద్దు, వాఘా బోర్డర్ మూసివేత

మొదటి పేజి తరువాయి

పర్యటిస్తున్న భారత జాతీయులకు అనుమతులతో పాటు, ఇతర వీసాలను సైతం పాక్ రద్దు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో నిన్న జరిగిన అత్యున్నత సమావేశంలో భారత్ సైతం ఇదే నిర్ణయం తీసుకుంది. పాక్‌లోని హైకమిషన్ కార్యాలయంలోని భారత దౌత్య సిబ్బందిని 30కి తగ్గించింది. అంతకుముందు భారత్ కూడా ఇదే చర్యలను ప్రకటించింది. నిన్నటి సమావేశంలో అటారీ బోర్డర్‌ను మూసివేయాలని భారత్ నిర్ణయించగా.. పాకిస్థాన్ సైతం వాఘా బోర్డర్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

దీంతో పాటు పాక్ గగనతలంంలోకి భారత్‌కు చెందిన విమానాలు గానీ, భారతీయ సంస్థలు నడుపుతున్న విమానాలు గానీ ప్రయాణించకుండా ఎయిర్‌స్పేస్‌ను మూసివేసింది. సౌదీ పర్యటన ముగించుకున్న అనంతరం ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించింది. ఈ నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. భారత్‌తో వాణిజ్యాన్ని తెగదెంపులు చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

సింధూ జలాల ఒప్పందాన్ని అమలును భారత్ తక్షణమే నిలిపివేయడాన్ని పాక్ ఖండించింది. 24 కోట్ల పాకిస్థాన్ పౌరులకు సంబంధించిన అంశంగా పేర్కొంది. సింధు జల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు ఉద్దేశించిన నీటిని మళ్లించడానికి లేదా ఆపడానికి జరిగే ప్రయత్నాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పేర్కొంది. అటువంటి చర్యలను తిప్పికొడతామంటూ సమావేశం అనంతరం పాక్ వెల్లడించింది.





## సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేసిన పాక్..
## అసలు అందులో ఏం ఉంది?
## భారత్‌కు నష్టమా?

**సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేసిన పాక్.. అసలు అందులో ఏం ఉంది? భారత్‌కు నష్టమా?**

పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాదుల హింసాత్మక దాడితో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. ఘటన వార్త విన్న దేశ ప్రజలు షాక్ కు గురయ్యారు. అమాయక టూరిస్టులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 27 మంది అక్కడికక్కడే చనిపోవడం దేశ ప్రజలను ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇప్పటికే రక్షణ దళాలు, కశ్మీర్ పోలీసులు, పారా మిలిటరీ దళాలు రంగంలోకి దిగి ఉగ్రవాదుల కదలికలపై పెద్ద ఎత్తున సర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. దేశ ప్రజలు ఉగ్రవాదులపై ఫైరవుతున్నారు. వారిని ఎక్కడున్నా దొరకపట్టి కఠినంగా శిక్షంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రక్షణ దళాలను కోరుతున్నారు.

అయితే, పహల్‌గామ్ ఉగ్రదాడికి సంబంధించి పాకిస్థాన్ తీరుపై భారత ప్రభుత్వం సీరియస్ గా రియాక్ట్ అయ్యింది. ఆ దేశంలో దౌత్య సంబంధాలను పూర్తి తెంచుకుంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. పాక్ పౌరులు, పర్యాటకులు వారంలో తమ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. అటారీ చెక్ పోస్టును కూడా వెంటనే నిలిపివేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఇక పాక్ పౌరులను భారత్ లోకి అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు భారత ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే.

ఈ క్రమంలోనే పాకిస్థాన్ కూడా మన దేశంపై ప్రతీకార చర్యలకు దిగుతోంది. వాణిజ్యాన్ని రద్దు చేసుకుంది. గతంలో చేసుకున్న అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో అతి ముఖ్యమైన చారిత్రక సిమ్లా ఒప్పందం ఉంది. పాకిస్థాన్ గగనతలాన్ని కూడా భారత విమానాలకు నిరాకరించింది. వాఘా సరిహద్దును మూసేస్తూ నిర్ణయం తీసుకుంది.

**అసలు సిమ్లా ఒప్పందం ఏంటి..?**

1971లో ఇండోపాక్ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో భారత్ విజయం సాధించింది. ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పే లక్ష్యంతో 1972లో సిమ్లా ఒప్పందం కుదిరింది. పాక్ పై భారత్ విజయం సాధించి, బంగ్లాదేశ్ ఏర్పడడానికి దోహదపడింది. యుద్ధం తర్వాత సంబంధాలను పునరుద్ధరించేందుకు సిమ్లా ఒప్పందం మార్గం సుగమం చేసింది.

**ఒప్పందంలో కీలక సూత్రం ఏంటంటే..?**

1972 జులై 2న హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని సిమ్లాలో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయిన జుల్ఫికర్ అలీ భుట్టో సిమ్లా ఒప్పందంపై సంతకాలు చేశారు. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య తలెత్తే వివాదాలను శాంతియుతంగా, ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది ఈ ఒప్పందంలోని కీలక సూత్రం. మూడో పక్షం జోక్యం లేకుండా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

ఈ ఒప్పందంలో భాగంగానే కాశ్మీర్‌లో నియంత్రణ రేఖ (LOC) ఏర్పాటు జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం 1971 డిసెంబర్ 17 నాటి కాల్పుల విరమణ రేఖను భారతదేశం పాకిస్తాన్ మధ్య నియంత్రణ రేఖ (LOC)గా మార్చడం జరిగింది. దీన్ని ఏకపక్షంగా మార్చరాదని రెండు దేశాలు అంగీకరించాయి. ఒప్పందంలో భాగంగా ఐక్యరాజ్యసమితి చార్టర్ సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలని, పరస్పర ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని గౌరవించుకోవాలని కూడా ఒప్పందంలో స్పష్టంగా ఉంది.

**సిమ్లా ఒప్పందం రద్దు చేస్తే ఏమవుతోంది..?**

రెండు దేశాల యుద్ధ ఖైదీలు తిరిగి రావడం, ప్రత్యక్ష చర్చల ద్వారా భవిష్యత్ వివాదాలను పరిష్కరించుకుంటామని ఒప్పందంలో పేర్కొన్నారు. దీని అర్థం ఏంటంటే..? కాశ్మీర్ సహా చాలా విషయాలకు సంబందించి ఎవరి జోక్యం లేకుండా పరిష్కరించుకోవాలన్నదే దీని ఉద్దేశం. అంటే ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తే.. మూడో దేశం జోక్యం చేసుకునే అవకాశం ఉంటుంది. గతంలో రెండు దేశాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ఐక్యరాజ్య సమితి సైతం చర్చించేందుకు ముందుకు రాలేదు.

అయితే, భారత్ సింధు జలాల ఒప్పందం రద్దు చేసుకున్న క్రమంలోనే పాక్ సిమ్లా ఒప్పందాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. సింధు జలాలను అడ్డుకోవడాన్ని తీవ్రంగా తిరస్కరిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. దీన్ని జలయుద్ధంగా అభివర్ణించింది.

## డీపీఆర్ ఆమోదం పొందకముందే
### కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణం: ఎన్‌డీఎస్ఏ నివేదిక

మొదటి పేజి తరువాయి



నీటిపారుదలశాఖ ఉల్లంఘనలకు పాల్పడింది. సాంకేతిక పరీక్షలు లేకుండానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్‌లు మార్చారు. బ్యారేజీలో నిర్వహణ లోపాలే సమస్యలు తెచ్చిపెట్టాయి. తొలి ఏడాదిలో సమస్య తలెత్తినా.. మరమ్మతులలో జాప్యం జరిగింది. డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని పాటించకపోవడంతో సమస్యలు పెరిగాయి. మేడిగడ్డ 7వ బ్లాక్ కింద పెద్ద గొయ్యి ఏర్పడటంతో పియర్ దెబ్బతింది. సికెంట్ పైల్ కటాఫ్స్‌లో నాణ్యత లేకపోవడం పియర్ కుంగడానికి కారణమైంది. నాణ్యతాలోపం కారణంగా ఎగువ, దిగువన కటాఫ్ సిస్టమ్ విఫలమైంది.

మేడిగడ్డలోని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలి. డిజైన్, నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయి. 3 బ్యారేజీలకు సంబంధించి పూర్తిగా పరీక్షలు జరగాలి. జియో టెక్నికల్, జియో ఫిజికల్ అధ్యయనాలు చేయాలి. హైడ్రాలిక్ మోడల్ స్టడీస్ చేపట్టాలి. అధ్యయనానికి ముందే గ్రౌంటింగ్‌తో అంచనా ఇబ్బందిగా మారింది. ఎనర్జీ డిసిపేషన్, నిర్మాణ అంశాలను సరిపడా డిజైన్ చేయలేదు. అన్ని బ్యారేజీలకు కటాఫ్ వాల్ అంశాలు ఆందోళనకరంగా ఉన్నాయి. దీర్ఘకాలిక భద్రత కోసం సమష్టిగా అన్ని విభాగాలు చర్యలు చేపట్టాలి'' అని ఎన్‌డీఎస్ఏ తన నివేదికలో పేర్కొంది.


## సింధు జలాలను ఆపడమంటే
## యుద్ధం ప్రకటించడమే: పాక్

మొదటి పేజి తరువాయి



కౌంటర్ చర్యలను ప్రకటించింది. భారత్‌లో జరిపే అన్ని వర్తకవ్యాపారాలను(మధ్యవర్తి దేశం ద్వారా జరిపే వ్యాపారలావాదేవీలను సైతం) నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. వాఘా సరిహద్దును మూసేస్తున్నట్లు తెలిపింది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ సిబ్బందిని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. భారతీయ పౌరులకు జారీ చేసే వీసాలను రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. సింధు జలాలను ఆపడమంటే యుద్ధం ప్రకటించడం కిందకే వస్తుందని పేర్కొంది. మరోవైపు సైన్యం సెలవులను రద్దు చేసిన పాక్ ప్రభుత్వం.. భారత్ గనుక యుద్ధానికి దిగితే ప్రతిఘటనకు సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చింది. బుధవారం సాయంత్రం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ భేటీలో కీలక నిర్ణయాలను ప్రకటించిన సంగతి తెలిసిందే.

అయితే పహల్గాం దాడిని ఖండించిన పాక్.. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది. ''భారత్‌లో జమ్ము కశ్మీర్, ఛత్తీస్‌గఢ్, మణిపూర్ సహా దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాల్లో తిరుగుబాట్లు నడుస్తున్నాయని.. బహుశా ఈ క్రమంలోనే పహల్గాం దాడి జరిగి ఉంటుందని, ఇందులో విదేశీ శక్తుల దాడి అయ్యి ఉండకపోవచ్చని'' పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్ వ్యాఖ్యానించారు. ప్రాథమిక హక్కులను కోల్పోయిన వ్యక్తులపై సైన్యం లేదంటే పోలీసులు దారుణాలకు పాల్పడుతుంటే.. పాకిస్తాన్‌ను నిందించడం అలవాటుగా మారిపోయింది. పహల్గాం దాడిలో.. మమ్మల్ని నిందించకండి'' అంటూ ఓ లోకల్ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు.




## తెలంగాణలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత

**తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.**

**ఈ కబురు**,హైదరాబాద్ :తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 23 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది.

ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్..

- **1000 మంది మావోయిస్టులను చుట్టుముట్టిన 20వేల బలగాలు..!**
- **ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో భారీ ఆపరేషన్ కొనసాగుతోంది.**




**ఈ కబురు,చర్ల:**
ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద యాంటీనక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపుర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

బీజాపుర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.

గాలింపు చర్యల్లో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. 48 గంటలుగా ఈ కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 3 వేల మందితో కూంబింగ్ చేపట్టగా.. గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. దీంతో ఈ 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. అయితే, భద్రతా బలగాల సంఖ్య 20వేల వరకు ఉంటుందని పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బస్తర్, అబూజ్‌బడ్ దండకారణ్యంపై హిడ్మాకు పూర్తి అవగాహన ఉంది. అతడి టార్గెట్‌గానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. హిడ్మాతో పాటు మావోయిస్టు బెటాలియన్ చీఫ్ దేవాను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది.



## నాగారం భూదాన్ భూముల్లో అక్రమాలు.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల్లో అక్రమాలు జరిగాయని మహేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.**

**ఈ కబురు,హైదరాబాద్:**
మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల్లో అక్రమాలు జరిగాయని మహేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా ప్రభుత్వంతోపాటు పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వారి భార్యలు, పిల్లలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.

భూదాన్ భూముల్లో అక్రమాలపై ప్రభుత్వం, భూదాన్ బోర్డుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు చేయించాలని కోరారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ భాస్కర్‌రెడ్డి.. వివాదాస్పద భూమిపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించొద్దని ఆదేశించారు. దర్యాప్తు నిర్వహిస్తే వాస్తవాలు బయటికొస్తాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం, సీబీఐ, ఈడీతోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. విచారణను జూన్ 26కు వాయిదా వేశారు.

# కేంద్ర సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకున్నా ఓకే అఖిలపక్ష భేటీలో రాహుల్



**ఈ కబురు,ఢిల్లీ:**
పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం ముగిసింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ జరిగింది. 2 గంటలకుపైగా సమావేశం కొనసాగింది. పహల్గామ్ మృతులకు అఖిలపక్షం నివాళులర్పించింది. నేతలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రదాడి అనంతరం తీసుకున్న చర్యలపై అఖిలపక్షానికి కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఉగ్రదాడుల్ని ఎదుర్కోవడంలో ఆయా పార్టీల సలహాలను కోరింది.

ఉగ్ర దాడులను అఖిలపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. కశ్మీర్‌లో శాంతి నెలకొనాలని.. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా సమర్థిస్తామని రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఇతర పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

**కశ్మీర్‌లో అశాంతి నెలకొల్పే శక్తులను అణచివేయాలి: మిథున్‌రెడ్డి**
ఉగ్రదాడిని ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా వైఎస్సార్‌సీపీ మద్దతు ఉంటుంది. కశ్మీర్‌లో అశాంతి నెలకొల్పే శక్తులను అణచివేయాలి. భద్రతను మరింత పటిష్టం చేయాలి. త్వరగా ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించాలని మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## పహల్గాం ఉగ్రదాడి.. రాష్ట్రపతితో అమిత్ షా, జై శంకర్ కీలక భేటీ

**పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి.**

**ఈ కబురు,దిల్లీ:**
పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పహల్గాంలో 26మంది భారతీయుల్ని ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చి చంపిన ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన కేంద్రం.. పాక్‌తో సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, పాక్ జాతీయులకు అన్ని వీసాలను రద్దు చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఇందుకు ప్రతిగా పాక్ సైతం భారత విమానాలకు గగనతలాన్ని మూసివేయడం వంటి చర్యలు తీసుకుంది. ఇరుదేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ కావడం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్ర దాడి ఘటనకు సంబంధించి పలు అంశాలను ఆమెకు వివరించినట్లు సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోను రాష్ట్రపతి తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.

**కీలక దేశాల దౌత్యవేత్తలతో భేటీ..**
పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా, కెనడాతో సహా G20 దేశాల ఎంపిక చేసిన రాయబారులతో సమావేశం నిర్వహించింది. ఈ భేటీ దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగినట్లు సమాచారం.

## హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ భట్టి విక్రమార్క

**భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**



**ఈ కబురు,హైదరాబాద్:**
భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. రేపటి నుంచి జరిగే ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

'ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ గురించి వివరిస్తాం. ఇందిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం. ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం'' అని మంత్రి తెలిపారు.

# పాకిస్తాన్ బందీగా భారత జవాన్..




**సరిహద్దుల్లో బీఎస్‌ఎఫ్ జవాన్‌ను బంధించిన పాక్**

**ఈ కబురు,న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి ఘటనతో భారత్‌పాక్ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. భారత జవానును పాకిస్తాన్ బందీగా చేసుకుంది. భారత్, పాక్ సరిహద్దుల్లో బీఎస్‌ఎఫ్ జవాన్‌ను పాక్ బంధించింది. తమ భూభాగంలోకి ప్రవేశించాడని పాక్ ఆరోపించింది. బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా బంధించడంపై భారత్ మండిపడింది. బుధవారం ఫిరోజ్‌పూర్ బోర్డర్ దగ్గర 182వ బెటాలియన్‌కు చెందిన బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ ప్రమాదవశాత్తూ బోర్డర్ దాటాడు. పాకిస్తాన్ రేంజర్లు బీఎస్‌ఎఫ్ జవాన్ పీకే సింగ్‌ను బంధించారు. ఆ సమయంలో పీకే సింగ్ బీఎస్‌ఎఫ్ యూనిఫాం ధరించి సర్వీస్ రైఫిల్ తో ఉన్నారు.

సరిహద్దు అవతల పొలం పనులు చేసుకుంటున్న రైతులకు తోడుగా ఉన్న పీకే సింగ్ ఒక చెట్టు కింద నీడలో కూర్చుని ఉండగా పాక్ రేంజర్లు ఆయనను బంధించారు. పీకే సింగ్ నిర్బంధంపై సరిహద్దులోని భద్రతా దళాల మధ్య సమావేశం కొనసాగుతోంది. బీఎస్‌ఎఫ్ జవానును తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని భారత్ స్పష్టం చేసింది. పహల్గాం ఘటన తర్వాత జరిగిన పరిణామాలతో భారత జవాను నిర్బంధం చర్చనీయాంశమైంది. ఏప్రిల్ 23న సాయంత్రం జవానును పాక్ నిర్బంధించింది.

పర్యాటకులే లక్ష్యంగా జమ్మూకాశ్మీర్‌లో టెర్రరిస్టులు తెగబడిన సంగతి తెలిసిందే. ఆర్మీ యూనిఫాంలో వచ్చి, మతం అడిగి మరీ కాల్పులు జరిపారు. దొరికినవాళ్లను దొరికినట్లు పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపేశారు. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ఆ 'మినీ స్విట్జర్లాండ్ '.. కాల్పులతో దద్దరిల్లింది. ఎక్కడికక్కడ మృతదేహాలతో రక్తసిక్తమైంది. ఈ మారణహోమంలో 26 మంది ప్రాణాలు వదిలారు. మృతుల్లో పలువురు హనీమూన్‌కు వచ్చిన దంపతులు ఉన్నారు. ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణానికి తామే పాల్పడ్డట్లు లష్కరే తోయిబా ఉగ్ర సంస్థకు చెందిన 'ది రెసిస్టెంట్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనతో భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.



## యుద్ధానికి సిద్ధమవుతున్న పాకిస్తాన్.. సైన్యానికి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటన

**ఈ కబురు:** జమ్మూకశ్మీర్‌లో పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే రెండు దేశాలు వ్యాపార సంబంధాలు తెగదెంపులు చేసుకున్నాయి. ఉగ్రవాదులు ఎక్కడున్నా వదిలిపెట్టం, వారికి ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అత్యంత కఠినంగా శిక్షిస్తామని ప్రధాని మోడీ పరోక్షంగా పాకిస్తాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో పాకిస్తాన్ అప్రమత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత జవాన్‌ను బంధించి వేధిస్తోన్న పాక్.. మరో సంచలన నిర్ణయం తీసుకున్నది.

యుద్ధ వాతావరణం తలపిస్తోన్న నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యానికి సెలవులు రద్దు చేసింది. ఈ మేరకు గురువారం అధికారిక ప్రకటన చేసింది. భారత్ దాడి చేస్తే తిరిగి తప్పకుండా దాడి చేయాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేసింది. దేనికైనా సిద్ధంగా ఉండాలని సైన్యానికి ఆదేశించింది. అంతేకాదు.. పాకిస్తాన్‌లో ఉన్న భారతీయులంతా వెంటనే భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని హెచ్చరికలు చేశారు.

పాక్‌తో సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, పాక్ జాతీయులకు అన్ని వీసాలను రద్దు చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఇరుదేశాల్లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి తీసుకెళ్లారు.




## రేపు జమ్మూకశ్మీర్‌కు రాహుల్ గాంధీ

**ఈ కబురు, శ్రీనగర్:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ శుక్రవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించనున్నారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనలో గాయపడి అనంత్‌నాగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన ఆయన.. ఉగ్రదాడి ఘటన తెలిసిన వెంటనే భారత్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. గురువారం నిర్వహించిన అఖిలపక్ష భేటీలోనూ పాల్గొన్నారు.మరోవైపు పహల్గాం ఉగ్రదాడి ఘటనకు నిరసనగా ఆ పార్టీ దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనుంది. పార్టీకి చెందిన అన్ని రాష్ట్రాలు, జిల్లా శాఖలు ఈ మార్చ్‌లో పాల్గొననున్నాయి. అలాగే, ఏప్రిల్ 25, 26 తేదీల్లో తలపెట్టిన 'సంవిధాన్ బచావో' కార్యక్రమాన్ని ఏప్రిల్ 27కు వాయిదా వేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

# పాక్ గగనతలం మూసివేత..
## ఎయిరిండియా, ఇండిగో కీలక ప్రకటన

**పాక్ తన గగనతలాన్ని మూసివేసిన నేపథ్యంలో ఎయిరిండియా, ఇండిగో విమానాలు ప్రత్యామ్నాయ మార్గంలో నడవనున్నాయి.**

భారత్ పాక్ మధ్య నెలకొన్న ద్వైపాక్షిక ఉద్రిక్తతల నేపథ్యంలో టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక ప్రకటన చేసింది. భారత్‌కు చెందిన విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రత్యామ్నాయ మార్గంలో విమానాలు నడపనున్నట్లు వెల్లడించింది. దీంతో ఆ మేర ప్రయాణ సమయం పెరగనుంది. ఎక్కువ ప్రయాణ సమయం కారణంగా టికెట్ ధర కూడా ఆ మేర పెరిగే అవకాశం ఉందని విమానయాన వర్గాలు పేర్కొంటున్నాయి.

''భారత్‌కు చెందిన విమానాలకు పాకిస్థాన్ తన గగనతలం నుంచి ప్రయాణాలపై ఆంక్షలు విధించింది. దీంతో ఉత్తర అమెరికా, యూకే, యూరప్, పశ్చిమాసియా దేశాల నుంచి వచ్చే/ వెళ్లే విమానాలు ప్రత్యామ్నాయ సుదూరపు మార్గంలో ప్రయాణిస్తాయి. ప్రయాణికులకు కలిగిన ఈ అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. గగనతలం మూసివేత మా చేతిలో లేని వ్యవహారం. ఏదేమైనా ఎయిరిండియా ప్రయాణికులు, సిబ్బంది భద్రత మాకు ముఖ్యం'' అని ఎయిరిండియా ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది.



**ఇండిగో ట్రావెల్ అడ్వైజరీ**
పాకిస్థాన్ ఎయిర్‌స్పేస్ మూసివేతతో తాము నడిపే కొన్ని అంతర్జాతీయ విమానాలపై ప్రభావం పడుతోందని ఇండిగో సంస్థ పేర్కొంది. వీలైనంత తొందరగా గమ్యస్థానాలకు చేర్చడంలో తమ సిబ్బంది ప్రయత్నిస్తారని తెలిపింది. ఒకవేళ మీరు ప్రయాణించబోయే విమానంపైనా దీని ప్రభావం ఉంటే స్టేటస్ చెక్ చేసి తమ వెబ్‌సైట్ ద్వారా రీ బుకింగ్ లేదా రిఫండ్‌ను పొందొచ్చని ప్రయాణికులకు సూచిస్తూ 'ఎక్స్' వేదికగా ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఎయిరిండియా, ఇండిగోతో పాటు స్పైస్‌జెట్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కూడా అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. ఉత్తరాది నగరాల నుంచి పశ్చిమ దేశాలపై వెళ్లే విమానాలపై గగనతలం మూసివేత ప్రభావం పడనుంది.



## వాట్సప్‌లో 'అడ్వాన్స్ చాట్ ప్రైవసీ' ఫీచర్.. సేవ్ చేద్దామంటే కుదరదు!

**వాట్సప్ కొత్త ప్రైవసీ ఫీచర్ తీసుకొచ్చింది. దీంతో అవతలి వ్యక్తులు మీ చాట్‌ను సేవ్ చేయలేరు.**

వాట్సప్ యూజర్లకు మరో కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. వ్యక్తిగత, గ్రూప్ చాట్స్‌లో మరింత ప్రైవసీని జోడిస్తూ 'అడ్వాన్స్‌డ్ చాట్ ప్రైవసీ' ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఇది ఆన్ చేసుకుంటే మీ మీడియాను అవతలి వ్యక్తులు సేవ్ చేయడం, ఎక్స్‌పోర్ట్ చేయడం వంటివి చేయలేరు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు ఈ సదుపాయాన్ని రోల్ అవుట్ చేసినట్లు వాట్సప్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. త్వరలో ఈ ఫీచర్ అందుబాటులోకి రానుంది.

అడ్వాన్స్ ఫీచర్ అనేది ఆన్ చేసుకుంటే మీరు పంపించే వ్యక్తిగత చాట్ అవతలి వారు డౌన్‌లోడ్ చేసుకోలేరు. ఆటోమేటిక్‌గా డౌన్‌లోడ్ కూడా అవ్వదు. అంటే మీరు పంపించే చాట్‌ని వేరే గ్రూప్‌నకు పంపించడం మినహా.. వాట్సప్‌ను దాటి వేరే సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం కుదరదు. మీరు పంపించిన చాట్స్‌ను ఎవరైనా ఎక్స్‌పోర్ట్ చేద్దామని ప్రయత్నించినా 'కెనాట్ ఎక్స్‌పోర్ట్ చాట్' అనే సందేశం కనిపిస్తుంది.

వాట్సప్ గ్రూపుల్లో ఉండేవారంతా మనకు తెలియాలని లేదు. ఏదైనా సున్నితమైన అంశంపై అలాంటి గ్రూపుల్లో చర్చిస్తున్నప్పుడు మీ చాట్‌ను అవతలి వ్యక్తులు తమ ప్రయోజనాల కోసం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఈ చాట్ ఫీచర్ ఉపయోగపడుతుంది. చాట్ పేరు మీద క్లిక్ చేసి 'అడ్వాన్స్‌డ్ చాట్ ప్రైవసీ' ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. వాట్సప్ అప్‌డేటెడ్‌గా ఉంటే ఇప్పటికే ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చి ఉంటుంది. లేదంటే మీ వాట్సప్‌ను అప్‌డేట్ చేసుకోండి.



### ఉగ్రదాడి బాధితులకు ఉచిత చికిత్స..

**ముకేశ్ అంబానీ ప్రకటన**
**పహల్గాం ఉగ్రదాడి ఘటనను రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ఖండించారు.**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనను రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ తీవ్రంగా ఖండించారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన రిలయన్స్ తరఫున తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉగ్రదాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అలాగే, ఉగ్రదాడిలో గాయపడిన వారికి ముంబయిలోని రిలయన్స్ ఫౌండేషన్‌కు చెందిన సర్ హెచ్‌ఎన్ హాస్పిటల్‌లో ఉచితంగా చికిత్స అందిస్తామని ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఉగ్రవాదం మానవాళికే మచ్చ అని, అది ఏ రూపంలో ఉన్నా సహించరాదని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో ప్రధాని మోదీ, భారత ప్రభుత్వానికి రిలయన్స్ అండగా ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# లాభాల స్వీకరణతో 7 రోజుల లాభాలకు బ్రేక్



**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 315 పాయింట్లు, నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయాయి.**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు, లాభాల స్వీకరణకు మదుపర్లు మొగ్గు చూపడం వంటి కారణాలతో సూచీలు నష్టాలు చవిచూశాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు కొనసాగగా.. విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, అమెరికా చైనా మధ్య వాణిజ్య ఘర్షణలు తగ్గుముఖం పట్టడంతో సూచీలు మోస్తరు నష్టాలకు పరిమితమయ్యాయి. మొత్తానికి సూచీల ఏడు రోజుల లాభాల ర్యాలీకి బ్రేక్ పడింది. సెన్సెక్స్ మళ్లీ 80వేల మార్కు దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 80,058.43 (క్రితం ముగింపు 80,116.49) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 79,724.55 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరికి 315 పాయింట్ల నష్టంతో 79,801.43 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 82 పాయింట్లు నష్టంతో 24,246 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.28గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.47 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,344 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలు..

## భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న ట్రంప్

**కొన్ని రకాల వస్తువులపై భారత్ సుంకాలు తగ్గించనుందనే విషయం తన దృష్టికి వచ్చిందని ట్రంప్ పేర్కొన్నారు.**

**ఈ కబురు;** భారత్ సుంకాలు తగ్గిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రకాల వస్తువులపై భారత్ సుంకాలు తగ్గించనుందనే విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఓవల్ ఆఫీస్‌లో పాత్రికేయులతో ఈమేరకు మాట్లాడారు. అయితే ఏ ఉత్పత్తులపై తగ్గింపు ఉంటుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు .

ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై భారత్, అమెరికా అధికారులు ఈనెల 23న వాషింగ్టన్‌లో చర్చలు ప్రారంభించారు. భారత్‌తో ఒప్పందం వల్ల అమెరికా వస్తువులకు కొత్త మార్కెట్లు తెరచుకుంటాయని, ఇరు దేశాల్లోని ఉద్యోగులు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు వస్తాయని ఇప్పటికే అమెరికా పేర్కొంది. టారిఫ్, టారిఫేతర అడ్డంకులను అమెరికా తగ్గించుకోవాలని అనుకుంటున్నట్లు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన షరతుల(టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సెస్)కు ఇరు దేశాలు తుదిరూపునిచ్చాయి కూడా. 90 రోజుల పాటు టారిఫ్ అమలుకు అమెరికా విరామం ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు రోజుల చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ తరఫు బృందానికి వాణిజ్య విభాగ అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్నవేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలోనే చర్చలు జరుగుతున్నాయి.

# పసిడి అమ్మకాలు 911% తగ్గే అవకాశం

**అధిక ధరల వల్లే: క్రిసిల్**
ముంబయి: అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో మేలిమి బంగారం ధర 10 గ్రాములు రూ.లక్షకు చేరింది. ఏడాది వ్యవధిలోనే పసిడి ధర భారీగా పెరగడంతో, ఆభరణాల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. వ్యవస్థీకృత పసిడి ఆభరణాల రిటెయిలర్ల అమ్మకాలు 202526లో 911% తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ తాజా నివేదికలో పేర్కొంది. బంగారం అధిక ధరల కారణంగా, విక్రయ సంస్థల ఆదాయాలు 1315% పెరగొచ్చని అంచనా వేసింది. వరుసగా నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఈ సంస్థలు 20 శాతానికి పైగా ఆదాయ వృద్ధి నమోదుచేశాయి. 202021 నుంచి పరిశ్రమ 2.5 రెట్లు వృద్ధి చెందింది. బంగారం అధిక ధరల కారణంగా, ఆభరణాలు అవసరమైన వారు తక్కువ పరిమాణంలో మాత్రమే కొంటున్నారు. ఫలితంగా అమ్మకాలు మందకొడిగానే కొనసాగొచ్చు. గిరాకీ తగ్గడంతో రిటెయిలర్లు ప్రచారాలు, రాయితీల ద్వారా విక్రయాలు పెంచుకోవడానికి చూస్తున్నారు. ముఖ్యంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై దృష్టిపెడుతున్నారు. బంగారాన్ని కొనుగోలు చేసిన ధర, తయారీ ఛార్జీలు కలిపినా అయ్యే ధర కంటే ఎక్కువకే ఆభరణాలను విక్రయిస్తున్నందున.. వ్యయాల ప్రభావం సంస్థలపై పడటం



లేదు. గతేడాదితో పోలిస్తే సంస్థల నిర్వహణ లాభాలు 3040 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రధానంగా పసిడి నిల్వలపై లాభాలు కలిసొస్తున్నాయి. బంగారం ధర ఇప్పుడు బాగా పెరిగినందున.. ఆభరణాల తయారీకి అవసరమైన పుత్తడి కొనుగోలు కోసం సంస్థలకు అధిక మూలధన రుణాలు అవసరమవుతున్నాయి. ప్రస్తుతానికి రుణాల నిర్వహణ అదుపులోనే ఉంది.202425లో భౌగోళిక, రాజకీయ ఆందోళనలతో పసిడి ధరలు 25% పెరిగాయి. ఫలితంగా రిటెయిలర్ల అమ్మకాలు 45% తగ్గాయి. 202425 సగటు ధరల కంటే ప్రస్తుతం పసిడి ధరలు 20% అధికంగా ఉన్నాయి. ఇప్పటి నుంచి ధర 45% ధర పెరిగినా కూడా, 202526లో సగటు ధరలు 2224% పెరగనున్నాయి.

**స్వల్పకాలంలో గిరాకీపై ప్రభావం: నిపుణులు**
పసిడి ధరలు ఒక్కసారిగా పెరగడంతో, స్వల్పకాలంలో ఆభరణాల గిరాకీపై ప్రతికూల ప్రభావం పడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ ఆదుకుంటాయని భావిస్తున్నారు. 'పసిడి ధరల షాక్ నుంచి కోలుకుంటేనే, గిరాకీ స్థిరపడుతుంది. మొత్తంగా మార్కెట్ సెంటిమెంట్ బాగానే ఉంది. 2023లో 741 టన్నుల పసిడిని దిగుమతి చేసుకోవగా, 2024లో 802 టన్నులకు ఇది చేరింది. పసిడి ధరలు 2530% పెరిగినా, గిరాకీ మెరుగ్గానే ఉండటాన్ని ఇది సూచిస్తోంద'ని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ దేశీయ మండలి ఛైర్మన్ రాజేశ్ రోక్డే తెలిపారు. మార్కెట్లో ఆశావహ పరిస్థితులు కనిపిస్తున్నాయని, పసిడి ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ ఛైర్మన్ సౌరభ్ గాడ్గిల్ పేర్కొన్నారు.

**ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణ**
పసిడి ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో నాలుగు రోజుల లాభాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు తర్వాత, మదుపర్లు లాభాలు స్వీకరణకు మొగ్గు చూపడమే ఇందుకు కారణం. ఎంసీఎక్స్ గణాంకాల ప్రకారం 10 గ్రాముల పసిడి జూన్ కాంట్రాక్టు రూ.1,975 (2.03%) తగ్గి రూ.95,365కు చేరింది.

**బంగారం రుణాల్లోకి బ్యాంక్ బజార్**
పసిడి రుణాల్లోకి ఫిన్‌టెక్ సంస్థ బ్యాంక్‌బజార్.కామ్ అడుగుపెట్టనుంది. పసిడి రుణాలు ఇచ్చేందుకు ముత్తూట్ ఫిన్‌కార్ప్‌తో సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా బ్యాంక్‌బజార్ సిరీస్ డీ2 రౌండ్‌లో రూ.15 కోట్ల పెట్టుబడులను ముత్తూట్ పెట్టనుంది. ప్రతిగా 1 శాతం వాటా పొందనుంది. డీ2 రౌండ్‌లో బ్యాంక్‌బజార్ రూ.55 కోట్ల పెట్టుబడులు దక్కించుకుంది. ఈ సందర్భంగా కంపెనీ విలువను రూ.1,700 కోట్లుగా లెక్కకట్టారు.





# నేను పాకిస్థానీని కాదు.. ప్రభాస్ మూవీ హీరోయిన్ పోస్ట్

**తాను పాకిస్థానీ అమ్మాయిని కాదని ఇమాన్వీ ఎస్మాయిల్ తెలిపారు. ఈ విషయంపై ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.**

కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని యావద్భారతం ఖండించింది. ఈ దాడి నేపథ్యంలో దాయాది పాకిస్థాన్‌తో సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోన్న విషయం తెలిసిందే. అయితే పాకిస్థాన్ నటీనటులు మన సినిమాల్లో నటించడానికి వీల్లేదంటూ నెట్టింట పోస్ట్‌లు షేర్ అవుతున్నాయి. దీంతో ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో హీరోయిన్ ఇమాన్వీ ఎస్మాయిల్ ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారారు. ఆమె పాకిస్థానీ అంటూ.. ఆమెను తీసుకోవద్దంటూ పోస్ట్‌లు షేర్ అవుతున్నాయి. ఈ విషయంపై ఇమాన్వీ క్లారిటీ ఇచ్చారు. తాను పాకిస్థానీ నటిని కాదని స్పష్టంచేస్తూ పోస్ట్ పెట్టారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

“నాకు, నా కుటుంబానికి సంబంధించిన కొన్ని తప్పుడు వార్తలు నెట్టింట ప్రచారం అవుతున్నాయి. నేను పాకిస్థానీని కాదు. నాకు, నా కుటుంబంలోని ఎవరికీ ఆ దేశంతో సంబంధాలు లేవు. నాపై ద్వేషాన్ని కలిగించాలనే ఏకైక ఉద్దేశంతో ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తున్నారు. కొన్ని పేరున్న వార్తా సంస్థలు కూడా నా విషయంలో కనీస పరిశోధనలు చేయకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయి” అని పేర్కొన్నారు.

“నేను భారత అమెరికన్‌ని అని గర్వంగా చెబుతాను. హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లిష్ మాట్లాడగలను. లాస్ ఏంజెలెస్‌లో పుట్టాను. నా తల్లిదండ్రులు అమెరికాకు వలసవెళ్లి.. అక్కడి పౌరులుగా మారారు. నేను చదివింది కూడా అక్కడే. చదువు పూర్తయిన తర్వాత నటిగా, కొరియోగ్రాఫర్‌గా, డ్యాన్సర్‌గా కెరీర్‌ను ప్రారంభించాను. ఈ రంగంలో ఎంతోకాలం కొనసాగిన తర్వాత భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పనిచేసే అవకాశాలను అందుకున్నాను. ఈ విషయంలో ఎంతో ఆనందంగా ఉన్నాను. సినిమా నా జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. భారతీయత, భారత సంస్కృతి నా రక్తంలోనే ఉంది. సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించండి” అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఉగ్రదాడి ఘటన దారుణమని మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

తన డ్యాన్స్, స్టైల్‌తో సోషల్ మీడియాలో ఎంతోమంది ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్నారు ఇమాన్వీ. దీంతో ప్రభాస్ హను రాఘవపూడి కాంబోలో రానున్న సినిమాలో అవకాశాన్ని అందుకున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమంలోనూ ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఇది రానుంది.



# దిల్ రాజు ప్రొడక్షన్‌లో చాహల్ మాజీ భార్య..!

ధనశ్రీ వర్మ పేరు దాదాపు అందరికీ సుపరిచితమైన పేరు. ఇటీవలే భారత క్రికెటర్ చాహల్‌తో విడాకులు తీసుకుంది. 2020లో చాహల్‌ను పెళ్లి చేసుకున్న ఈ ముద్దుగుమ్మ ఐదేళ్లకే తమ వివాహ బంధానికి గుడ్ బై చెప్పేసింది. అయితే కెరియర్ పరంగా ధనశ్రీ వర్మ కొరియోగ్రాఫర్‌గా రాణిస్తున్నారు. ఆమె త్వరలోనే ఓ తెలుగు సినిమాలో ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ఇంతకీ ఆ సంగతులేంటో చూసేద్దాం.

ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రొడక్షన్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కొరియోగ్రాఫర్ యష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘ఆకాశం దాటి వస్తావా’. శశి కుమార్ ముతులూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మలయాళ నటి కార్తీక మురళీధరన్ హీరోయిన్‌గా నటిస్తోంది. దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్‌లో బలగం తర్వాత హర్షిత్, హన్షిత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ ద్వారానే ధనశ్రీ వర్మ తెలుగులో ఎంట్రీ ఇస్తోంది. ఇటీవలే ఈ మూవీ షూటింగ్ సెట్స్‌లో ధనశ్రీ వర్మ కనిపించింది. ఈ సినిమాలో చాహల్ మాజీ భార్య కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

కాగా.. ముంబయిలో పుట్టి పెరిగిన ధనశ్రీ డెంటిస్ట్‌గా వైద్య రంగంలో వృత్తిని కొనసాగించారు. నృత్యంపై తనకున్న అభిరుచితో లెజెండరీ కొరియోగ్రాఫర్ షియామాక్ దావర్ వద్ద శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత తానే సొంతంగా డ్యాన్స్ అకాడమీని స్థాపించారు. ధనశ్రీ వర్మ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో తన డ్యాన్స్ వీడియోల ద్వారా గుర్తింపు తెచ్చుకుంది. ఇక వ్యక్తిగత జీవిత విషయానికొస్తే ధనశ్రీ డిసెంబర్ 22, 2020న భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్‌ను వివాహం చేసుకుంది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఇటీవలే విడాకులు తీసుకున్నారు.

# రావణుడిగా యశ్.. ‘రామాయణ’లో సీత పాత్ర వద్దనుకున్న శ్రీనిధి!

**‘కేజీయఫ్’ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన కథానాయిక శ్రీనిధిశెట్టి ‘రామాయణ’లో సీత పాత్ర వద్దనుకుంది. అందుకు కారణాన్ని తాజాగా వెల్లడించింది.**

నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఇతిహాసగాథ ‘రామాయణ’ . రాముడిగా రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రావణుడిగా కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈ క్రమంలో కథానాయిక శ్రీనిధిశెట్టి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ మూవీలో సీత పాత్ర కోసం తొలుత అవకాశం తనకే వచ్చిందని, ఆడిషన్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. అయితే, ఆ పాత్ర వద్దనుకోవడం వెనుక కారణాన్ని కూడా వెల్లడించారు.

**ఖలేజా టైటిల్.. అత్యాశకు పోయి రూ.10లక్షలు పోగొట్టుకున్నారు!**

తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. “‘రామాయణ’లో సీత పాత్ర కోసం నేను స్క్రీన్ టెస్ట్‌కు వెళ్లా. మూడు సన్నివేశాలకు బాగా సిద్ధమయ్యా. నేను ఇచ్చిన ప్రదర్శనకు చిత్ర బృందం కూడా సంతోషం వ్యక్తం చేసింది. ఆ తర్వాత ఇందులో యశ్ భాగమవుతున్నారని తెలిసింది. అప్పటికి ‘కేజీయఫ్ 2’ విడుదలై మా జోడీకి మంచి పేరు వచ్చింది. ఇదంతా కేవలం రెండు నెలల వ్యవధిలోనే జరిగింది. అయితే, అప్పుడు యశ్ ఏ పాత్ర పోషిస్తున్నారో నాకు తెలియదు. ఒకవేళ ఆయన రావణుడిగా నటించి, నేను సీత పాత్ర చేస్తే, చూడటానికి అస్సలు బాగుండదు. ‘కేజీయఫ్’లో మా ప్రేమను చూసిన ప్రేక్షకులు రావణుడు, సీతగా మమ్మల్ని చూసి జీర్ణించుకోలేరనిపించింది. ఈ కాంబినేషన్ తెరపై బాగుండదనిపించింది. పైగా వింతగా ఉంటుందనుకున్నా”

“సీత పాత్రకు సాయిపల్లవి చక్కటి ఎంపిక. ఆమెను సీత పాత్రలో చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఉన్నా. ‘ఏదైనా పనిచేసినప్పుడు అది గొప్పది. చేయనప్పుడు అద్భుతమైనది కావచ్చు. ఎందుకంటే, మంచి అవకాశాలకు తలుపులు తెరిచే ఉంటాయి’ అని నేను నమ్ముతా” అని శ్రీనిధి తెలిపారు. ప్రస్తుతం నానితో కలిసి శ్రీనిధి నటించిన ‘హిట్ 3’ మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న ‘తెలుగు కదా’ సినిమాలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.



# అమాయకులపై దాడి మాత్రమే కాదు.. కశ్మీర్‌పై జరిగిన దాడి: ప్రకాశ్‌రాజ్

**పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటనపై సినీనటుడు ప్రకాశ్‌రాజ్ స్పందించారు. ఎక్స్ వేదికగా సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు.**



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దారుణ మారణకాండను సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ ఖండించారు. ఈ ఘటనతో ప్రతి కశ్మీరీ గుండె ముక్కలైందని, మాటలు రావడం లేదన్నారు. గుండెల్లో అంతులేని బాధతో ఇది రాస్తున్నట్లు చెప్పారు. ఇది అమాయకులపై జరిగిన దాడి మాత్రమే కాదని కశ్మీర్‌పై జరిగిన దాడిగా అభివర్ణించారు. కశ్మీరీలు మౌనం వీడాల్సిన సమయమిదని, ఈ క్రూరమైన చర్యను ఖండించాల్సిందేనన్నారు.

“ఏప్రిల్ 22, 2025.. పర్వతాలు సైతం మోయలేనంత నిశ్శబ్దం ఆవరించిన రోజు.. ప్రశాంతమైన ప్రకృతి ప్రదేశమైన పహల్గాంలో నెత్తురు చిందిన రోజు.. ప్రతి కశ్మీరీ గుండె పగిలింది. కూర్రమైన, అర్ధరహితమైన ఈ చర్యను చెప్పటానికి మాటలు కూడా రావడం లేదు. అందుకే బరువైన, బాధతో కూడిన హృదయంతో ఇది రాస్తున్నా. మన ఇంటికి వచ్చిన అమాయక అతిథులను దారుణం కాల్చి చంపారు. మన పైన్ అడవులు, అందమైన సెలయేళ్లు, ప్రశాంత వాతావరణం ఆస్వాదించడానికి వచ్చిన పర్యాటకులు భయానక స్థితిని ఎదుర్కొన్నారు. ఈ అనాగరిక దాడి అమాయకులపై జరిగిన దాడి మాత్రమే కాదు, కశ్మీర్‌పై దాడి. శతాబ్దాల సంప్రదాయాలకు జరిగిన అవమానం. మన విశ్వాసాన్ని దెబ్బతీసేలా దుష్ట ప్రయోజనాల కోసం చేసిన దారుణచర్య. కశ్మీరీలంతా దుఃఖంలో ఉన్నాం. ఈ దుశ్చర్యకు మా రక్తం మరిగిపోతోంది”

“ఇలాంటివి జరిగిన ప్రతిసారీ, మనల్ని మనం నిరూపించుకోవాల్సి వస్తోంది. గుర్తింపును కాపాడుకోవడంతో పాటు, చేయని పనికి అవమాన భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ విషయంలో మరోసారి నిస్సందేహంగా చెబుతున్నా. దీనిని అస్సలు క్షమించం.. ఇది నిజంగా భయంకరమైన చర్య. అంతకుమించి పిరికిపంద చర్య”

“ఇలాంటి సమయంలో కశ్మీరులు మౌనంగా ఉండకూడదు. మేము ఎంతో దుఃఖంతో ఉన్నాం. మన ఇంటిలో జరిగిన ఈ క్రూర చర్యకు నిజంగా సిగ్గుపడుతున్నాం. దయచేసి మమ్మల్ని ఈ దృష్టికోణం నుంచి మాత్రం చూడొద్దని వేడుకుంటున్నా. ఇది నిజమైన కశ్మీరీలు చేసింది కాదు. మా తల్లిదండ్రులు హంతకులను పెంచి పోషించలేదు. ఇలాంటి చర్యల పట్ల ఎలాంటి సమర్థన, న్యాయం, విజయం లేదు. ఇది కేవలం సిగ్గుపడాల్సిన అంశం. మీరు (ఉగ్రవాదులు) ఏం ఆశించి ఇలాంటి ఇలాంటి దారుణ హింసకు పాల్పడ్డారో తెలియదు. మీ చర్య కొన్ని కుటుంబాలను నాశనం చేసింది. పిల్లలను అనాథలుగా మార్చింది”

“కశ్మీర్ ఆట స్థలం కాదు. యుద్ధం క్షేత్రం అంతకన్నా కాదు. ఇదేమీ మీరు ఉపయోగించుకునే ఆయుధమూ కాదు. అతిథులకు స్వాగతం పలికి, గౌరవించే ప్రదేశం. ఈ ఘటనలో బాధిత కుటుంబాలు అనుభవించే బాధ వారి ఒక్కరిదే కాదు. మా అందరిది. మీతో మేమూ దుఃఖిస్తున్నాం. మీరు కోల్పోయిన దానికి చింతిస్తున్నాం. మీరు కశ్మీర్‌లో ప్రశాంతంగా ఉండటానికి వచ్చారు. కానీ, మేము దానిని కాపాడలేకపోయాం. అందుకు క్షమించమని అడుగుతున్నాం” అని ప్రకాశ్‌రాజ్ పోస్ట్ చేశారు.

# ఏడాది తర్వాత ఓటీటీలోకి హారర్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!

నటి హన్సిక ప్రధాన పాత్రలో సబరి, గురు సరవనన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘గార్డియన్’. హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చింది. గతేడాది రిలీజ్ అయిన ఈ సినిమా తమిళంలో హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం తెలుగు వెర్షన్ ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఆత్మ కథ చుట్టూ తిరిగే కథతో దీన్ని రూపొందించారు. కొందరి కారణంగా అన్యాయానికి గురైన ఓ యువతి (హన్సిక) ఆత్మగా మారుతుంది. వారిపై పగ తీర్చుకోవడానికి ఆ ఆత్మ ఆవహించిన యువతికి హీరో, హీరోయిన్లు సాయం చేస్తారు. అయితే ఆ యువతి ఎవరు? ఆమెకు జరిగిన అన్యాయం ఏంటనే కథాంశంతో ‘గార్డియన్’ తెరకెక్కింది. ఇందులోని విజువల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సామ్ సీఎస్ అందించిన మ్యూజిక్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





## ‘ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్ గురించి మాట్లాడు..

# మధ్యలో ధోనీ ఎందుకు?’

**సన్‌రైజర్స్ గురించి చర్చించే కార్యక్రమంలో ఒక్కసారిగా ధోనీ ప్రస్తావన తీసుకొచ్చిన మాజీ సహచరుడికి సెహ్వాగ్ పొరపాటును సరిదిద్దడం గమనార్హం.**


భారత మాజీ క్రికెటర్ అమిత్ మిశ్రా చేసిన పొరపాటును మరో మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ సరి చేశాడు. ఇదంతా లైవ్‌లో కావడంతో నెట్టింట ట్రోలింగ్ మొదలైంది. మధ్యలో ధోనీ ప్రస్తావన తీసుకురావడం గమనార్హం. దీంతో ధోనీ ఏమన్నా సన్‌రైజర్స్ జట్టులో ఉన్నాడా? అంటూ కామెంట్లు వస్తున్నాయి. అసలు ఇంతకీ ఏమైందంటే?

బుధవారం రాత్రి ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ మ్యాచ్ జరిగింది. ముంబయి ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌పై చర్చా కార్యక్రమంలో మాజీ క్రికెటర్లు అమిత్ మిశ్రా, వీరేంద్ర సెహ్వాగ్ పాల్గొన్నారు. సన్‌రైజర్స్ ఇంకా ప్లేఆఫ్స్‌కు చేరే అవకాశం ఏమైనా ఉందా? అనే ప్రశ్నకు మిశ్రా స్పందిస్తూ.. ‘‘అయితే ఇది దాదాపు అసాధ్యమే. వారు ఆడుతున్న తీరును చూస్తే మిగతా మ్యాచులు గెలవడం చాలా కష్టం. అన్ని విభాగాల్లోనూ రాణించాల్సిన అవసరం ఉంది. ఒకవేళ ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చి కనీసం 30 బంతులు ఆడాలి. అయితే, టాప్ ఆర్డర్ ఇంకాస్త దూకుడు ప్రదర్శించాలి’’ అని వ్యాఖ్యానించాడు.

వెంటనే సెహ్వాగ్ కలగజేసుకొని.. ‘‘ఇక్కడ ఎస్ఆర్‌హెచ్ గురించి ప్రశ్న అడిగారు. ధోనీ లేదా సీఎస్కే గురించి కాదు’’ అని తెలిపాడు. ఈ సందర్భంగా అమిత్ మిశ్రా ప్యానల్‌కు క్షమాపణలు చెబుతూ.. ‘‘ఇప్పుడు అంతా ధోనీ పేరు మారుమోగిపోవడం వల్లే’’ అని అనడంతో నవ్వులు విరిశాయి. శుక్రవారం సన్‌రైజర్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

**పిచ్‌ను తప్పుగా అంచనా వేయడం వల్లే: డానియల్ వెట్టోరి**

ముంబయి చేతిలో తమ జట్టు ఓటమికి పిచ్‌ను తప్పుగా అంచనా వేయడం వల్లేనని సన్‌రైజర్స్ ప్రధాన కోచ్ డానియల్ వెట్టోరి వ్యాఖ్యానించాడు. ‘‘టాస్ అత్యంత కీలకం. మేం తొలుత బౌలింగ్ చేయాలని అనుకున్నాం. ఇంతకుముందు చూసిన పిచ్‌లతో పోలిస్తే ఇది భిన్నమైంది. ఇక్కడ 250+ స్కోర్లు నమోదు చేయడం చాలా కష్టం. తొలి రెండు ఓవర్లు చూడగానే అర్థమైంది. పవర్‌ప్లేలో మరిన్ని పరుగులు చేయాల్సింది. వికెట్లను కోల్పోవడం వల్ల ఇబ్బంది పడ్డాం. కనీసం 180 పరుగులు చేసి ఉంటే విజయం సాధించేందుకు ఎక్కువ అవకాశాలు ఉండేవి’’ అని తెలిపాడు.



# చంపేస్తామంటూ..

## గౌతమ్ గంభీర్‌కు బెదిరింపులు

**భారత మాజీ క్రికెటర్, ప్రధాన కోచ్ గంభీర్‌కు బెదిరింపులు ఈమెయిల్స్ ద్వారా వచ్చాయి. ఈ విషయాన్ని గంభీర్ దిల్లీ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.**

yభారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్, భాజపా మాజీ ఎంపీ గౌతమ్ గంభీర్ కు బెదిరింపులు వచ్చాయి. ‘ఐ కిల్ యూ’ అంటూ రెండు ఈమెయిల్స్ వచ్చినట్లు సెంట్రల్ దిల్లీ పోలీసులకు ఫిర్యాదు గంభీర్ ఫిర్యాదు చేశాడు. సైబర్ సెల్ ఎక్కడినుంచి వచ్చాయి? ఎవరు పంపారనే దానిపై విచారణ చేపట్టింది. పహల్గాం ఉగ్రదాడిపై స్పందించినందుకే గంభీర్‌కు ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. తనకు రక్షణ కల్పించాలని దిల్లీ పోలీసులను గంభీర్ కోరాడు. ఐసిస్ కశ్మీర్ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ‘‘ఉగ్రదాడిలో మృతి చెందినవారి కోసం ప్రార్థిద్దాం. దీనికి బాధ్యులు తప్పకుండా భారీ మూల్యం చెల్లించుకుంటారు. భారత్ తిప్పికొడుతుంది’’ అని గంభీర్ పహల్గాం ఘటనపై పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడి చేయడంతో 26 మంది మృతి చెందారు. ఇందులో ఇద్దరు తెలుగు వ్యక్తులు ఉన్నారు. ఘటనలో పలువురు గాయపడ్డారు.

**పాక్ ప్రధానిపై డానిష్ కనేరియా విమర్శలు**

జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ స్పందించకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా విమర్శలు గుప్పించాడు. ప్రధాని షరీఫ్‌కు వాస్తవం తెలుసంటూ వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నట్లు పేర్కొన్నాడు. ‘‘పాకిస్థాన్‌కు ఎలాంటి పాత్ర లేకపోతే నేరుగా ప్రధాని షరీఫ్ ఎందుకు ఖండించలేదు. ఎందుకు ఒక్కసారిగా హై అలెర్ట్ ప్రకటించారు? ఎందుకంటే వాస్తవం ఏంటో మీకు తెలుసు. మీరే టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పించి పెంచి పోషిస్తున్నారు. మిమ్మల్ని చూస్తుంటే సిగ్గేస్తోంది’’ అని పోస్టు పెట్టాడు.

## రాజస్థాన్‌కు మళ్లీ నిరాశే..

# ఉత్కంఠ పోరులో బెంగళూరు విజయం

**సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 11 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

ఐపీఎల్ 18 లో సొంతమైదానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఎట్టకేలకు విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో బెంగళూరు 11 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (70), పడిక్కల్ (50) అర్ధశతకాలతో చెలరేగారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (49), ధ్రువ్ జురెల్ (47) పోరాడినప్పటికీ.. చివర్లో ఆ జట్టు బోల్తాపడింది. చివరి రెండు ఓవర్లలో రాజస్థాన్ లక్ష్యం 18 పరుగులు కాగా, హేజిల్‌వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 19వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. చివరి ఓవర్లో లక్ష్యం 17 పరుగులు కాగా, యశ్ దయల్ వికెట్ తీసి కేవలం 5 పరుగులే ఇచ్చాడు. బెంగళూరు బౌలర్లలో హేజిల్‌వుడ్ 4, కృనాల్ పాండ్య 2, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ ఒక్కో వికెట్ తీశారు.



తొలుత కోహ్లి (70; 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), దేవ్‌దత్ పడిక్కల్ (50; 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) విజృంభణతో బెంగళూరు భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (26; 23 బంతుల్లో 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. చివర్లో జితేశ్ శర్మ (20*;10 బంతుల్లో 4 ఫోర్లు), టిమ్ డేవిడ్ (23; 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ 2, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం పడిక్కల్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్‌లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లికిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్‌పాండే వేసిన 15 ఓవర్‌లో పడిక్కల్ రెండు సిక్స్‌లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో కోహ్లి ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు ఆర్సీబీ 156/1తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో బెంగళూరు మూడు వికెట్లు కోల్పోయింది. కోహ్లిని ఆర్చర్ ఔట్ చేయగా.. సందీప్ ఒకే ఓవర్‌లో పడిక్కల్, రజత్ పటీదార్ (1)ని వెనక్కి పంపాడు. జితేశ్, టిమ్ డేవిడ్ ధాటిగా ఆడటంతో చివరి మూడు ఓవర్లలో 38 పరుగులు రాబట్టింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు సాల్ట్, కోహ్లి శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో కోహ్లి వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్‌పాండేకు వరుసగా రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి ఆర్సీబీ 59/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్‌లో ఫిల్ సాల్ట్‌ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు.

## దంచికొట్టిన కోహ్లి, పడిక్కల్..

# రాజస్థాన్ ముందు భారీ లక్ష్యం

**రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆర్సీబీ ఇన్నింగ్స్ ముగిసింది.**

**బెంగళూరు:** ఐపీఎల్ 18 సీజన్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో రాజస్థాన్‌పై ఆర్సీబీకిదే అత్యధిక స్కోరు. విరాట్ కోహ్లి (70; 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), దేవ్‌దత్ పడిక్కల్ (50; 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ శతకాలు బాదారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (26; 23 బంతుల్లో 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. చివర్లో జితేశ్ శర్మ (20*;10 బంతుల్లో 4 ఫోర్లు), టిమ్ డేవిడ్ (23; 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ 2, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు.





టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు సాల్ట్, కోహ్లి శుభారంభం అందించారు. ఈ జోడీ నిలకడగా బౌండరీలు బాది తొలి వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో కోహ్లి వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్‌పాండేకు వరుసగా రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి ఆర్సీబీ 59/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్‌లో ఫిల్ సాల్ట్‌ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు.

అనంతరం పడిక్కల్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్‌లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లికిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్‌పాండే వేసిన 15 ఓవర్‌లో పడిక్కల్ రెండు సిక్స్‌లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో కోహ్లి ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు ఆర్సీబీ 156/1తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో బెంగళూరు మూడు వికెట్లు కోల్పోయింది. కోహ్లిని ఆర్చర్ ఔట్ చేయగా.. సందీప్ ఒకే ఓవర్‌లో పడిక్కల్, రజత్ పటీదార్ (1)ని వెనక్కి పంపాడు. జితేశ్, టిమ్ డేవిడ్ ధాటిగా ఆడటంతో చివరి మూడు ఓవర్లలో 38 పరుగులు రాబట్టింది.

## అలా చేస్తే అర్జున్ తెందూల్కర్

# మరో క్రిస్ గేల్ అవుతాడు: యోగ్‌రాజ్ సింగ్

**అర్జున్ తెందూల్కర్ యువరాజ్ సింగ్ వద్ద శిక్షణ పొందితే మరో క్రిస్ గేల్ అవుతాడని యువీ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు.**

సచిన్ తెందూల్కర్ తనయుడు అర్జున్.. భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ వద్ద కోచింగ్ తీసుకుంటే మరో క్రిస్ గేల్ అవుతాడని యువీ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు. 25 ఏళ్ల అర్జున్ తెందూల్కర్ ఫాస్ట్‌బౌలర్. ప్రస్తుతం ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ జట్టులో ఉన్నాడు. అతడిని మెగా వేలంలో రూ.30 లక్షలకు కొనుగోలు చేశారు. మాజీ క్రికెటర్ అయిన యోగ్‌రాజ్ వద్ద అర్జున్ 2022లో కొన్ని రోజులపాటు శిక్షణ పొందాడు. అప్పటి సంగతుల గురించి యోగ్‌రాజ్ తాజాగా మాట్లాడాడు.

బ్యాటింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలని అర్జున్‌ను కోరినట్లు తెలిపాడు. తన కుమారుడికి శిక్షణ ఇవ్వాలని సచిన్ .. యువరాజ్‌ని కోరితే అర్జున్ తదుపరి క్రిస్ గేల్ గా మారే అవకాశం ఉందని యోగ్‌రాజ్ పేర్కొన్నాడు. ‘‘బౌలింగ్‌పై తక్కువ దృష్టి పెట్టి బ్యాటింగ్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాలని నేను అర్జున్‌కు చెప్పాను. సచిన్ తన కుమారుడి విషయం గురించి యువరాజ్‌తో మాట్లాడాలి.





అర్జున్‌ను యువరాజ్ వద్ద మూడు నెలలపాటు శిక్షణ పొందితే అతను తదుపరి క్రిస్ గేల్ అవుతాడని నేను పందెం వేస్తున్నాను. ఒక ఫాస్ట్ బౌలర్ తరచుగా ఒత్తిడికి గురైతే అంత సమర్థవంతంగా బౌలింగ్ చేయలేడు. అర్జున్‌ని యువరాజ్‌కి అప్పగించాలి’ అని యోగ్‌రాజ్ వివరించాడు.

ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో అర్జున్ తెందూల్కర్ పెద్దగా ఫామ్‌లో లేడు. విజయ్ హజారే ట్రోఫీ 202425లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 40 పరుగులు చేశాడు. ఇక బౌలింగ్ విషయానికొస్తే.. మూడు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. రంజీ ట్రోఫీలో మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 51 రన్స్ చేశాడు. బౌలింగ్‌లో మాత్రం రాణించాడు. నాలుగు మ్యాచ్‌ల్లో 18.18 యావరేజీతో 16 వికెట్లు తీశాడు. 2023లో ముంబయి తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అర్జున్.. ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడాడు. ఈ సీజన్‌లో అతడికి తుది జట్టులో దక్కలేదు.